సాక్షి
కర్నూలు

శుక్రవారం । 14 । జూలై । 2023



అన్నప్రసాద వితరణకు విరాళం
శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి గురువారం హైదరాబాద్‌కు చెందిన పి.పద్మ రూ.1,00,116లు విరాళంగా అందజేశారు.



పేదల ఇళ్లకు విద్యుత్ వెలుగులు
జగనన్న కాలనీల్లో ప్రతి ఇంటికి రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సౌకర్యం కల్పిస్తోంది. జిల్లాలో ఇందు కోసం రూ.9.30కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్లు నిర్మిస్తున్నారు. IIలో▸



5.95 లక్షల మొక్కలు
జిల్లాలోని పది నర్సరీల్లో 41 రకాలకు సంబంధించి 5,95,500 మొక్కలు అందుబాటులో ఉన్నాయి. మొక్క రకం, సైజ్‌ను బట్టి రూ.5, రూ.10 ప్రకారం చెల్లించి తీసుకోవచ్చు. IIలో▸

న్యూస్‌రీల్

నిజ బృందావన దర్శనం



మంత్రాలయం: పవిత్ర ఏకాదశి సందర్భంగా గురువారం భక్తులకు రాఘవేంద్రుల నిజ బృందావన దర్శనం కల్పించారు. ఆనవాయితీలో భాగంగా బృందావనానికి ఎలాంటి అలంకరణలు, అభిషేకాలు, పూజలు చేపట్టలేదు. వస్త్రం, తులసీమాల ధారణలో బృందావన దర్శనం ఏర్పాటు చేశారు. గురువారం కావడంతో భక్తులు వేలాదిగా తరలి వచ్చి రాఘవేంద్రస్వామిని దర్శించుకున్నారు.

22న జెడ్పీ సర్వసభ్య సమావేశం

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 22న ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ జి.నాసర రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్న సమావేశంలో నాడు–నేడు(విద్య), గృహ నిర్మాణం, వ్యవసాయం, గ్రామీణ నీటి సరఫరా–పారిశుద్ధ్యం శాఖలపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ, జిల్లా గ్రంథాలయ సంస్థ, వాల్మీకి/బోయ, కుర్ని, వీరశైవ లింగాయత్, బెస్త కార్పొరేషన్ల చైర్మన్లు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ, మంత్రులతో పాటు ఆయా ప్రభుత్వ శాఖ అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

18న జాబ్ మేళా

కర్నూలు సిటీ: జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 18వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు నైపుణ్యాభివృద్ధి జిల్లా అధికారి వి.శ్రీకాంత్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్, డిగ్రీ చదివిన వారు అర్హులని, 18 నుంచి 30 ఏళ్ల వయస్సు ఉన్నవారు మేళాకు హాజరు కావాలని పేర్కొన్నారు. ఎస్‌బీఐ కార్డ్స్, అగ్రి సొల్యూషన్స్, ఎంఎస్‌ఏ మోటార్స్ కంపెనీల్లో ఉద్యోగాలు ఉన్నాయని, ఎంపికైన వారికి నెలకు రూ.15 వేలు వేతనం చెల్లిస్తారని తెలిపారు. వివరాలకు 9059290821,9908114205 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నేడు కర్నూలు, ఆదోనిలో సబ్సిడీపై టమాట పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు నగరంతో పాటు ఆదోని పట్టణంలో కూడా సబ్సిడీపై టమాట పంపిణీ చేపట్టడానికి మార్కెటింగ్ శాఖ చర్యలు చేపట్టింది. ఇంతవరకు సబ్సిడీ టమాటను కర్నూలులోని మూడు రైతుబజార్లలో మాత్రమే పంపిణీ చేస్తున్నారు. గురువారం కర్నూలు రైతుబజార్లతో పాటు ఆదోని రైతుబజారులో ప్రత్యేక కౌంటరు ఏర్పాటు చేసి కిలో రూ.50 ప్రకారం పంపిణీ చేస్తారు. జిల్లాకు 6 టన్నుల టమాట వస్తుండగా.. కర్నూలులో 4 టన్నులు, ఆదోనిలో రెండు టన్నులు సబ్సిడీపై పంపిణీ చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణమూర్తి తెలిపారు. టమాట ధరలు మరింతగా పెరిగాయి. కర్నూలు రైతుబజారులో కిలో టమాటధర రూ.110 ఉండగా.. పక్కనే బయట కిలో రూ.140 ప్రకారం విక్రయిస్తున్నారు. సబ్సిడీపై కిలో రూ.50కే పంపిణీ చేస్తుండటం వినియోగదారులకు ఎంతో ఊరటనిస్తోంది.

93 శాతం ఈ కేవైసీ పూర్తి

కర్నూలు(అగ్రికల్చర్): పీఎం కిసాన్ కింద జిల్లాలో 93 శాతం మంది రైతులు ఈ–కేవైసీ చేయించుకున్నారు. దీంతో రాష్ట్రంలో కర్నూలు జిల్లా 3వ స్థానంలో నిలిచింది. జిల్లాలో పీఎం కిసాన్ కింద లబ్ధిపొందుతున్న రైతులు 2,48,866 మంది ఉండగా 2,31,070 మంది ఈ కేవైసీ చేయించుకున్నారని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. ఇంకా 17,796 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందని, ఈ నెల చివరి వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఈసెట్ కౌన్సెలింగ్‌కు నేటి నుంచి రిజిస్ట్రేషన్

కర్నూలు సిటీ: ఈసెట్–2023 ప్రవేశ పరీక్షల్లో అర్హత సాధించిన విద్యార్థినీ, విద్యార్థులు నేటి(శుక్రవారం)నుంచి ఈ నెల 17వ తేదీ వరకు కౌన్సెలింగ్‌కు ఫీజు https://cets.apsche.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎస్.జి పుల్లారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్(బి.తాండ్రపాడు)కాలేజీ ప్రిన్సిపాల్ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు విద్యార్హత ధ్రువ పత్రాల పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు. వెరిఫికేషన్ చేయించుకున్న విద్యార్థులు ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు కాలేజీ ఆప్షన్స్ ఇచ్చుకోవచ్చునని, 22న ఆప్షన్‌ను మార్పు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. 25న కాలేజీలను కేటాయిస్తారన్నారు.

వ్యాధులను కొనితింటూ!

ప్రపంచం కొత్త పుంతలు తొక్కుతోంది. టెక్నాలజీ ఏ స్థాయిలో అభివృద్ధి చెందుతుందో అదే స్థాయిలో ప్రజల ఆర్థిక శక్తి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో స్వతంత్ర, విలాసవంతమైన జీవితానికి ప్రాధాన్యత కోరుకుంటున్నారు. కోవిడ్–19 తర్వాత ఎక్కువ శాతం జీవనశైలి ఇదే తరహాలో సాగుతోంది. ఈక్రమంలోనే ఆహారపు అలవాట్లు పూర్తిగా మారిపోయాయి. ఇంటి ఆహారం కంటే డాబాలు, రెస్టారెంట్లు, హోటళ్లు, బేకరీ ఫుడ్‌ను ఎక్కువగా తీసుకుంటున్నారు. ఇదే ఇప్పుడు ప్రధాన సమస్యగా మారింది. నిల్వ ఉన్న ఆహారం, రసాయనాలు, కల్తీ ఆహారంతో రోగాల బారిన పడుతున్నారు. క్యాన్సర్ బారిన పడే రోగుల్లో 53 శాతం కల్తీ ఆహారమే కారణమని పలు సర్వేల్లో వెల్లడి కావడం ఆందోళన కలిగిస్తోంది.

– సాక్షి ప్రతినిధి, కర్నూలు



మారిన ఆహారపు అలవాట్లతో ముప్పు
- రెస్టారెంట్లు, హోటళ్ల భోజనంపైనే మక్కువ
- సందర్భం ఏదైనా ఫంక్షన్ల పేరిట దుబారా ఖర్చు
- నిల్వ ఆహారంతో పాటు రసాయనాల వినియోగం

పాతికేళ్ల కిందట వరకు ఆకలి తీర్చుకునేందుకే ఆహారం. ఎక్కడికైనా వెళ్లినా భోజనం సమయానికి ఇంటికి రాలేని పరిస్థితులు ఉన్నప్పుడే హోటళ్లను ఆశ్రయించేవాళ్లు. కొందరు ఎంత సమయమైనా ఇంటికి వచ్చే భోజనం చేస్తారు. సంపాదనలో తక్కువ ఖర్చు చేసి, ఎక్కువ దాచుకునేవారు. ఇది ఆర్థికంగానూ, ఆరోగ్యంగానూ మంచి లక్షణం. ఇప్పుడు ఆ ధోరణి మారింది. సిటీలు, పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ 'పార్టీ కల్చర్' వచ్చింది. బర్త్‌డే, మ్యారేజ్‌డే, ప్రమోషన్, ట్రాన్స్‌ఫర్.. సందర్భం ఏదైనా 'పార్టీలు' చేసుకోవడం పరిపాటిగా మారింది. ఆర్థిక శక్తి పెరగడంతో ఇంటి భోజనం కంటే రెస్టారెంట్లలోని ఆహారం తినడానికే ఇష్టపడుతున్నారు. కొత్త రుచులకు అలవాటు పడి ఇంటి భోజనాన్ని 'బోర్'గా ఫీలవుతున్నారు. నలుగురు స్నేహితులు కలిస్తే డిన్నర్ బయట చేస్తున్నారు. ఖరీదైన ఆహారం తింటున్నామనే భ్రమలో ఉన్నారు కానీ.. ఆరోగ్యకర, పోషకాహారాన్ని తింటున్నామా? లేదా? అనే విషయంపై దృష్టి సారించని పరిస్థితి.

గతంలో హోటల్‌కు వెళితే భోజనం, చపాతి, పరోటా, రాగిసంకటి, కుష్కా, బిర్యానీ ఉండేవి. ఇప్పుడు రెస్టారెంట్లలో మెనూ చూస్తే పేజీకి పది రకాల వెరైటీలు ఉంటాయి. 90శాతం వెజ్, నాన్ వెజ్ వంటకాల్లో కలర్ కోటింగ్, టేస్టింగ్ సాల్ట్ వినియోగిస్తారు. ఎర్రగా ఆకర్షణీయంగా ఉండే డ్రై ఐటెమ్స్‌లో ప్రతీది రసాయన మిశ్రితమే. బిర్యానీలో మెటానియల్ ఎల్లో, టార్‌ట్రాజిన్, టేస్టింగ్‌సాల్ట్(చైనాఉప్పు) వాడుతున్నారు. ఐస్‌క్రీం వినియోగం పెరిగింది. ప్రతీ ఐస్‌క్రీంలో రంగు కోసం టార్‌ట్రాజిన్, గడ్డకట్టేందుకు ఇతర రసాయనాలు వినియోగిస్తున్నారు. అలాగే బేకరీ

వీకెండ్ కల్చర్.. వెరీ డేంజర్
ధనికులతో పాటు మధ్య తరగతి ప్రజల్లో కూడా ఆర్థిక, కొనుగోలు శక్తి పెరిగింది. దీంతో వారంలో కనీసం ఒకరోజైనా 'ఫ్యామిలీ'తో రెస్టారెంట్లకు వెళ్తున్నారు. దీంతో వీకెండ్స్‌లో రెస్టారెంట్లలో 'టేబుల్' కోసం వేచి చూడాల్సిన పరిస్థితి. ఒక్క జోన్ రోడ్‌లో కొత్తగా ఇటీవల 19 రెస్టారెంట్లు ఏర్పాటయ్యాయి. దీన్నిబట్టే జనాలు ఏ స్థాయిలో రెస్టారెంట్లకు వెళుతున్నారో తెలుస్తోంది. ఒకరిని చూసి మరొకరు 'వీకెండ్ కల్చర్'కు అలవాటు పడుతున్నారు. దీంతో పాటు ఈ తరం పెద్దల్లో చాలామంది తల్లిదండ్రులు ప్రాథమిక విద్య దశలోనే చదువు ఆపేసిన వారు ఉన్నారు. వీరికి ఆహార వినియోగంపై అవగాహన తక్కువ. పిల్లల సంతోషం కోసం రెస్టారెంట్లకు తీసుకెళ్లి పిల్లలు ఏం కావాలంటే అది తినిపిస్తున్నారు. తినే ఆహారం ప్రాణాంతకమైంది అని గ్రహించలేకపోతున్నారు.

గర్భస్థశిశువులపై కూడా ప్రమాదమే
గర్భవతులు తీసుకునే ఆహారంలో ఇలాంటి రసాయన ఆహారం ఉంటే పిండం యొక్క జీవక్రియపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. అలాగే బాలింతలు తీసుకునే ఆహారంతో నవజాత శిశువులు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంది. 35ఏళ్ల కంటే తక్కువ వయస్సున్న మహిళలు ఎక్కువగా మాంసాహారం, కొవ్వు పదార్థాలు తీసుకుంటున్నట్లు ఓ సర్వే వెల్లడించింది. ఇందులో ఇంటి ఆహారం కాకుండా రెస్టారెంట్లకు వెళ్లడం, జొమాటా, స్విగ్గీ ద్వారా తెచ్చుకుని తినడంతో వీరిలో ఎక్కువగా హార్మోనల్ వ్యాధులు కూడా సంక్రమిస్తున్నాయి. దీంతోనే చిన్న వయస్సులోనే థైరాయిడ్, హార్మోనల్ సమస్యలతో పాటు బీపీ, షుగర్ లాంటి వ్యాధులకు రోజూ మందులు వాడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కొత్త రుచులు.. సరికొత్త రోగాలు



ఫుడ్ కూడా ఎక్కువగా తీసుకుంటున్నారు. పిజ్జా, బర్గర్, డోనెట్స్‌తో పాటు సామాన్యులకు పేర్లు కూడా తెలీని రకరకాల రుచులు మార్కెట్‌లోకి వచ్చాయి. వీటిలో వాడే చీజ్‌తో పాటు రసాయనాలు ప్రమాదమే. బేకరీలలో సిల్వర్‌పూత ఉండే స్వీట్లతో పాటు రంగులు ఉన్న మిఠాయిలు తింటే దీర్ఘకాలంలో క్యాన్సర్ ఖాయం. రెస్టారెంట్లు, బేకరీ ఆహారాన్ని వరుసగా 40రోజులు తింటే కీళ్లనొప్పులు, జీర్ణసంబంధిత వ్యాధులు వస్తాయి. మరింత అధికమైతే క్యాన్సర్ వచ్చే ప్రమాదముంది. అలాగే శరీరానికి అవసరమైన ఆహారం కంటే ఎక్కువగా తినడంతో ఊబకాయం వస్తోంది. శారీరక శ్రమ కూడా తగ్గడంతో ఎన్‌సీడీ(నాన్ కమ్యూనల్ డిసీసెస్) ఎక్కువగా వస్తున్నాయి.

కోవిడ్ తర్వాత మారిన ఆహారపు అలవాట్లు
కోవిడ్–19 సమయంలో ఆరోగ్యంగా ఉండాలంటే మాంసాహారం ఎక్కువగా తీసుకోవాలి, బలవర్ధక ఆహారాన్ని తీసుకోవాలనే భావన అందరిలో వచ్చింది. అప్పట్లో ఎక్కువ మంది ఆహారంపై దృష్టిపెట్టారు. ఆ తర్వాత అలవాటుగా మార్చుకున్నారు. రెస్టారెంట్లకు వెళ్లేవారి సంఖ్య, కొత్తగా ఏర్పాటైన రెస్టారెంట్లను చూస్తే ఈ విషయం స్పష్టమవుతుంది.

వీటి వినియోగంతో క్యాన్సర్ ముప్పు
- ➤ మెటానియల్ ఎల్లో వాడకం నిషేధంలో ఉన్నా వినియోగిస్తున్నారు. ఇది ఆరోగ్యంపై వెంటనే దుష్ప్రభావం చూపించదు. నెమ్మదిగా క్యాన్సర్ కారకమవుతుంది. చిన్నారుల్లో నిద్రలేమి, నరాల సంబంధిత వ్యాధులు వస్తాయి.
- ➤ వంటకాల్లో రంగుకోసం వాడే నిషేధిత టార్‌ట్రాజిన్ చాలా ప్రమాదకరం. దీంతో మానసిక వ్యథ, థైరాయిడ్, క్యాన్సర్, ఎలర్జీ, దద్దుర్లు, తామర, రక్తకణజాలంలో హానికర కణజాలాల వృద్ధి చెందడం, డీఎన్‌ఏ నష్టపోవడం, నిద్రలేమి, నీరసం వస్తాయి.
- ➤ స్వీట్లు, బిస్కెట్లలో ఆరెంజ్ రంగు కోసం వాడే సన్‌సెటన్, పసుపు రంగు కోసం వాడే కార్ట్రాజ్, గ్రీన్ కలర్ కోసం వాడే బ్రిలియంట్ బ్లూ, టార్టాజిన్‌లు చాలా ప్రమాదకరం.
- ➤ చాక్లెట్లలో వాడే రోడ్‌మస్–బి కూడా ప్రాణాంతకమే.

ఇదీ సంగతి..

ఐదేళ్ల కిందటితో పోలిస్తే రెస్టారెంట్లకు వెళ్లే వారిలో పెరుగుదల శాతం:	**257** శాతం
క్యాన్సర్ బాధితుల్లో కల్తీ ఆహారం తినేవారి సంఖ్య:	**53**శాతం
ఏటా పెరుగుతున్న క్యాన్సర్ రోగుల సంఖ్య:	**5-7**శాతం
సంపాదనలో ఆహారానికి ఎక్కువగా ఖర్చు చేసే వారి సంఖ్య:	**81** శాతం
పదేళ్లతో పోలిస్తే ఊబకాయంతో బాధపడేవారి సంఖ్యలో పెరుగుదల:	వందశాతం(రెట్టింపు)

చెడు బ్యాక్టీరియా వృద్ధి



ఎక్కువగా బయటి ఆహారాన్ని తినడం వల్ల పేగుల్లో మంచి బ్యాక్టీరియా నశించి చెడు బ్యాక్టీరియా వృద్ధి చెంది అనేక రకాల వ్యాధులు వస్తాయి జంక్ ఫుడ్‌లో కేలరీలతో పాటు పోషకాలు తక్కువ. ఇలాంటి ఆహారంలో ఎక్కువగా షుగర్స్, సాల్ట్, ట్రాన్స్‌ఫాట్(ఆహారం నిల్వ ఉంచేందుకు వాడే రసాయనం), ప్రాసెస్ట్ కెమికల్స్ ఉంటాయి. దీనివల్ల స్థూలకాయంతో పాటు బీపీ, షుగర్, కాలేయ సమస్యలు, కొన్ని రకాల క్యాన్సర్లు వస్తాయి.

– డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి, గ్యాస్ట్రో ఎంట్రాలజి హెచ్‌ఓడీ, జీజీహెచ్, కర్నూలు

310 పాఠశాలల్లో 1,330 అదనపు తరగతి గదులు

- హెచ్‌ఎం కమిటీ అకౌంట్‌లో రూ.20 కోట్ల నిధులు
- అక్టోబర్ 2 నాటికి అందుబాటులోకి 81 అంగన్‌వాడీ కేంద్రాలు
- విద్యాశాఖ సమీక్షలో కలెక్టర్ డాక్టర్ జి.సృజన





సమీక్షకు హాజరైన అధికారులు, (ఇన్‌సెట్) మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

కర్నూలు(సెంట్రల్): ఆగస్టు నెలాఖరుకు 310 పాఠశాలల్లో 1,330 అదనపు తరగతి గదులు పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్లాలని అధికారులకు కలెక్టర్ డాక్టర్ జి.సృజన సూచించారు. రన్నింగ్ వాటర్, కిచెన్ షెడ్లు, టాయిలెట్లు, విద్యుత్ ఇతర మౌలిక సదుపాయల కల్పన పనులను నెలాఖరులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాలులో విద్యాశాఖకు సంబంధించి మనబడి నాడు–నేడు పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..నాడు–నేడు పనులకు నిధుల కొరత లేదన్నారు. హెచ్‌ఎం కమిటీ అకౌంట్‌లో రూ.20 కోట్లు ఉన్నట్లు చెప్పారు. పనులను వేగవంతం చేసి పూర్తయిన వాటికి బిల్లులు చేసేందుకు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. నాలుగు పాఠశాలల్లో విద్యుదీకరణ పనులు పూర్తి కాకున్నా.. అయినట్లు ఫొటోలను అప్‌లోడ్‌ చేసిన ఇంజినీరింగ్ అసిస్టెంట్‌పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చర్యలు తీసుకోవాలని పీఆర్ ఎస్‌ఈ సుబ్రమణ్యంను ఆదేశించారు. తడకనపల్లె పాఠశాలలో టాయిలెట్లు మరమ్మతుల కోసం అనుమతులు తీసుకొని కొత్త వాటిని నిర్మిస్తుండడంతో వివరణ తీసుకోవాలని సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీ వేణుగోపాల్‌ను ఆదేశించారు.

అక్టోబర్ 2 నాటికి అంగన్‌వాడీ కేంద్రాలను పూర్తి చేయాలి
నాడు–నేడులో భాగంగా నిర్మిస్తున్న 81 అంగన్‌వాడీ కేంద్రాలను అక్టోబర్ 2 నాటికి పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో 31, పీఆర్‌లో 17, ఆర్‌డబ్ల్యూఎస్‌లో 16, ఏపీఈడబ్ల్యూఐడీసీలో 16, పీహెచ్‌ఈడీలో ఒకటి మొత్తం 81 అంగన్‌వాడీలు నిర్మాణంలో ఉన్నాయన్నారు. పాత అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయిలెట్లను వెంటనే నిర్మించాలన్నారు. పూర్తయిన అంగన్‌వాడీలకు నీటి సదుపాయాన్ని కల్పించాలని ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావు, ఏపీఈడబ్ల్యూడీసీ ఎస్‌ఈ మనోహర్, ఐసీడీఎస్ పీడీ ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

పోలీసు శాఖలో బదిలీలు

- ఎనిమిది మంది ఎస్‌ఐలకు స్థానచలనం

కర్నూలు: జిల్లా పోలీసు శాఖలో ఎనిమిది మంది ఎస్‌ఐలకు స్థానచలనం కలిగింది. పరిపాలన సౌలభ్యంతో పాటు ఆరోపణలు, విధుల పట్ల అలసత్వం వంటి కారణాలతో వీరు పనిచేస్తున్న స్టేషన్‌ను తప్పించి మరో చోటుకు బదిలీ చేస్తూ ఎస్పీ కృష్ణకాంత్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	పని చేస్తున్న స్టేషన్	బదిలీ స్టేషన్
ఎం.రాజారెడ్డి	కోసిగి పీఎస్	ఓర్వకల్లు పీఎస్
బి.సతీష్ కుమార్	ఆదోని ట్రాఫిక్	కోసిగి పీఎస్
కె.శ్రీనివాసులు	పెద్దకడుబూరు పీఎస్	ఇస్వి పీఎస్
ఎల్.విజయలక్ష్మి	ఇస్వి పీఎస్	ఆదోని త్రీటౌన్
వి.చిన్న పీరయ్య	ఆదోని త్రీటౌన్	పెద్దతుంబలం పీఎస్
డి.మహేష్ కుమార్	వీఆర్, కర్నూలు	పెద్దకడుబూరు పీఎస్
ఎన్.సి.మల్లికార్జున	ఓర్వకల్లు పీఎస్	ఫ్యాక్షన్ జోన్, కర్నూలు
వి.రమేష్ బాబు	పెద్దతుంబలం పీఎస్	సీసీఎస్, కర్నూలు

ఆశాజనకంగా వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వివిధ మండలాల్లో వర్షాలు ఆశాజనకంగా కురిశాయి. ఇప్పటికే సాగు చేసిన పంటలు కోలుకోనుండగా.. విత్తన పనులు ఊపందుకునే అవకాశం ఏర్పడింది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు 38 మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు భారీ వర్షం కురిసింది. కర్నూలు జిల్లా చిప్పగిరిలో అత్యధికంగా 38.8 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లా మొత్తం మీద 8.1 మి.మీ వర్షం కురిసింది. జూలై నెల సాధారణ వర్షపాతం 90.7 మి.మీ కాగా ఇప్పటి వరకు 25 మి.మీ వర్షపాతం మాత్రమే నమోదైంది. ఖరీఫ్ సాధారణ సాగు 4,21,548 హెక్టార్లు ఉండగా.. ఇప్పటి వరకు 52,150 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయి. ఇక నంద్యాల జిల్లాలో 3.4 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. జూలై నెల సాధారణ వర్షపాతం 141.2 మి.మీ కాగా ఇప్పటి వరకు 42.5 మి.మీ వర్షం మాత్రమే కురిసింది.

ప్రాంతం	వర్షపాతం (మి.మీ)
ఆదోని	30.8
దేవనకొండ	22.8
సీ.బెళగల్	22.4
కౌతాళం	20.4
కోసిగి	17.2
బండిఆత్మకూరు	12
దొర్నిపాడు	10.2

నిత్యావసరాలను అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు

- రైతు బజార్లలో బియ్యం, కంది, మినపప్పు స్టాళ్లను ఏర్పాటు చేయండి
- జేసీ నారపురెడ్డి మౌర్య



డీలర్లతో మాట్లాడుతున్న జేసీ ఎన్. మౌర్య

కర్నూలు(సెంట్రల్): నిత్యావసరాలను అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హోల్‌సేల్ డీలర్లను జేసీ నారపురెడ్డి మౌర్య హెచ్చరించారు. గురువారం సాయంత్రం ఆమె కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో బియ్యం, బ్యాళ్లు, మినపప్పు హోల్‌సేల్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం కేజీ సోనామసూరి బియ్యం రూ.51, కందిపప్పు రూ.140, మినపప్పు రూ.110 ప్రకారం అమ్మాలని ఆదేశించారు. కర్నూలులోని సీక్యాంపు, కొత్తపేట, ఆదోని రైతు బజార్లలో ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేసి ప్రతి కుటుంబానికి 5 కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, అర్ధకేజీ మినపప్పులను అమ్మాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

సేవకు సలాం

వలంటీర్ల సేవలకు ప్రజలు సలాం చేస్తున్నారు. కౌతాళం మండల పరిధిలోని లక్ష్మీనగర్‌కు చెందిన కూలీలు చూడి మహదేవి, బైటిగేరి వెంకటేశమ్మ, బోయ ఈరమ్మ, గజ్జెహళ్లి లక్ష్మి పని కోసం 2021 మార్చి 15వ తేదీన తెలంగాణ రాష్ట్రం నల్లగొండ జిల్లా పాములపాడు గ్రామానికి వెళ్లారు. ఈకేవైసీ చేయకపోతే రేషన్‌కార్డు రద్దు అవుతుందని తెలుసుకుని వలంటీర్ మూకన్న అక్కడికి వెళ్లారు. పొలం పనులు చేస్తున్న వారితో ఈకేవైసీ చేయించి రేషన్ కార్డు రద్దు కాకుండా జాగ్రత్త తీసుకున్నారు. దీంతో వలంటీరుకు వలస కూలీలు కృతజ్ఞతలు తెలిపారు. – కౌతాళం



పొలానికి వెళ్లి ఈకేవైసీ చేయిస్తున్న వలంటీర్ మూకన్న (ఫైల్)

ఈ ప్రభుత్వమే మళ్లీ రావాలి



వలంటీర్ల ఉండడంతో మాకు ప్రభుత్వ పథకాలు అన్నీ అందుతున్నాయి. మేం ఎక్కడో తెలంగాణలో ఉంటే వలంటీర్ అక్కడికే వచ్చి ఈకెవైసీ చేయించి మా రేషన్‌కార్డులు రద్దు కాకుండా చూశారు. చాలా మందికి పింఛన్లను కూడా అక్కడికే వచ్చి ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. గతంలో వలస వెళ్లిన వారు మళ్లీ గ్రామానికి వచ్చి పింఛన్ తీసుకోవాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఇలాంటి ప్రభుత్వమే మళ్లీ రావాలి.

– చూడి మహదేవి

మంత్రాలయంలో మహాభిరాముడు



శ్రీరాముడి నమూనా కాంస్య విగ్రహం

వేదభూమి అయిన మంత్రాలయంలో 108 అడుగుల ఎత్తయిన శ్రీరాముడి కాంస్య విగ్రహం ఏర్పాటు కానుంది. రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుభుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో జై శ్రీరామ ఫౌండేషన్ వారు ఇందు కోసం ఏర్పాట్లు చేశారు. మంత్రాలయంలో ఎమ్మిగనూరు రోడ్డు వైపున ఉన్న మఠానికి చెందిన 10 ఎకరాల్లో విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే మంత్రాలయంలో శ్రీరాముడి నమూనా విగ్రహాన్ని ప్రతిష్టించి, చండీయాగం చేశారు. విగ్రహం, ఆలయ నిర్మాణానికి సంబంధించిన శంకుస్థాపన కార్యక్రమాన్ని ఈ నెల 18న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వర్చువల్‌గా ప్రారంభించేందుకు అంగీకరించినట్లు జై శ్రీరామ్ ఫౌండేషన్ నిర్వాహకులు ఎంపీ శ్రీధర్, కె.రాములు తెలిపారు. మొత్తం రూ.250 కోట్లతో కాంస్య విగ్రహం, చుట్టూ తొమ్మిది ఆలయాలను నిర్మించనున్నట్లు చెప్పారు. కాంస్య విగ్రహాన్ని ఢిల్లీలో తయారు చేస్తున్నారని, అది పూర్తి కావడానికి మరో ఎనిమిది నెలలు పట్టే అవకాశం ఉందని పేర్కొన్నారు. – మంత్రాలయం రూరల్

క్లుప్తంగా

అర్హులందరికీ జగనన్న విద్యా దీవెన



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సాధికారత అధికారిణి వెంకటలక్ష్మమ్మ

కర్నూలు(అర్బన్): జిల్లాలో అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ తదితర వర్గాల్లోని అర్హులైన విద్యార్థులందరికీ జగనన్న విద్య, వసతి దీవెన అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారిణి పి.వెంకటలక్ష్మమ్మ కోరారు. గురువారం ఉదయం స్థానిక బీసీ స్టడీ సర్కిల్‌లో ఆయా శాఖలకు చెందిన సహాయ సంక్షేమ అధికారులు, బీసీహెచ్‌డబ్ల్యూఓలు, కార్యాలయ సిబ్బందితో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఇంకా దాదాపు 500 మంది బీసీ విద్యార్థులకు ఎన్‌పీసీఐ మ్యాపింగ్ జరగలేదన్నారు. సచివాలయాల వారీగా ఎన్‌పీసీఐ మ్యాపింగ్ జరగని విద్యార్థుల డేటాను సేకరించి వారికి బ్యాంకు ఖాతాలు లేకుంటే పోస్టాఫీసుల్లో ఖాతాలు ఓపెన్ చేయించి ఎన్‌పీసీఐ మ్యాపింగ్ చేయించాలన్నారు. జిల్లాలోని అన్ని బీసీ సంక్షేమ వసతి గృహాల్లో పెంచిన మెస్ చార్జీలకు అనుగుణంగా మెనూ పాటించాలన్నారు. సమావేశంలో ఎస్సీ, బీసీ సహాయ సంక్షేమాధికారులు ఎస్.లీలావతి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ అకాడమీలో ప్రవేశానికి 17న పోటీలు

కర్నూలు(రూరల్): హ్యాండ్‌బాల్ బాలుర అకాడమీలో ప్రవేశానికి ఈ నెల 17న తెనాలిలో ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాశాఖ సీఈఓ రమణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 14 నుంచి 18 సంవత్సరాల వయస్సు కలిగి ఎస్‌ఎస్‌ఎఫ్ నిర్వహించిన సబ్ జూనియర్, జూనియర్ చాంపియన్ షిప్‌లో మెదటి నాలుగు స్థానాలలో, ఇంటర్ జోనల్, ఇంటర్ యూనివర్సిటీ పోటీలలో మెదటి రెండు స్థానాలలో, స్కూల్ గేమ్స్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచిన వారు అర్హులని పేర్కొన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న పత్రాలు, ఆధార్ కార్డు, జనన పత్రం, పాస్‌ఫొటోలు-5, సివిల్ సర్జన్ జారీ చేసిన మెడికల్ ఫిట్‌నెస్ పత్రంతో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 7842829449 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పేదల ఇళ్లకు విద్యుత్ వెలుగులు

- మెరుగైన విద్యుత్ సరఫరాకు ప్రత్యేక సబ్‌స్టేషన్ల నిర్మాణం
- రూ.9.30కోట్లతో పనులు ప్రారంభం
- రెండు నెలల్లో పూర్తికి చర్యలు
- జగన్నాథగట్టుపై ఇప్పటికే 99 శాతం పనులు పూర్తి
- పేదలు ఇళ్లలో చేరక ముందే నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు



జగన్నాథగట్టుపై టిడ్కో ఇళ్ల కోసం నిర్మిస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్

కర్నూలు(రాజ్‌విహార్): జగనన్న కాలనీల్లో పేదలకు ప్రభుత్వం పెద్ద సంఖ్యలో గృహాలు నిర్మిస్తోంది. ఇందులో ప్రతి ఇంటికి విద్యుత్ సౌకర్యం కల్పిస్తోంది. ఇప్పటికే కాలనీల్లో ఉన్న విద్యుత్ సామర్థ్యం చాలకపోవడంతో అధికారులు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచారు. తాజాగా మెరుగైన విద్యుత్ సరఫరా కోసం సబ్‌స్టేషన్లు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అందుకు కావాల్సిన నిధులు, సామగ్రి సర్కారు మంజూరు చేయడంతో పనులు వేగంగా జరుగుతున్నాయి. మరో నెల రోజుల్లో పూర్తి చేసి కాలనీలకు విద్యుత్ సరఫరా అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

రూ. 49.12 కోట్లతో పనులు

ప్రభుత్వం ఏర్పాటు చేసే జగనన్న కాలనీల్లో నిర్మించే ఇళ్లకు ఉచిత కనెక్షన్ల కోసం సుమారు రూ.49 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఒక్కో ఇంటికి రూ.5 వేల చొప్పున 98,681 ఇళ్లకు సుమారు రూ.49.12 కోట్లతో ప్రణాళికలు పంపించారు. వాటికి విద్యుత్ సర్వీసు వైరు, మీటరు, బోర్డు ఏర్పాటు చేయనుంది. దీంతో ఇప్పటికే 1,200 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో పాటు 1,500 స్తంభాలు, 800 కిలో మీటర్ల కొత్త ఎల్‌టీ లైను ఏర్పాటు చేశారు. కాలనీల నిర్మాణాలు, ప్రజలకు అత్యవసరమైన మంచి నీటి సరఫరా కోసం కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని 641 కాలనీల్లో వేసిన 486 బోర్లకు విద్యుత్ సౌకర్యం కల్పించారు.

మెరుగైన విద్యుత్ కోసం సబ్‌స్టేషన్లు

టిడ్కో, జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న ఇళ్లకు మెరుగైన విద్యుత్ సరఫరాకు సబ్‌స్టేషన్లు మంజూరు చేశారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ప్రస్తుతం ఉన్న 33/11కేవీ 242 ఉప కేంద్రాల సామర్థ్యం చాలదని అంచనా వేసి జిల్లాల్లో అత్యధిక ఇళ్లు నిర్మిస్తున్న కర్నూలు జగన్నాథగట్టు లే అవుట్‌తో పాటు ఆత్మకూరు, ఆదోని టౌన్స్, నంద్యాల జగనన్న కాలనీల్లో 33/11 కేవీ సబ్‌స్టేషన్లు నిర్మిస్తున్నారు.

మంజూరైన సబ్‌స్టేషన్ల వివరాలు

డివిజన్ పేరు	లే అవుట్ల సంఖ్య	ఇళ్ల సంఖ్య	సబ్‌స్టేషన్‌కు మంజూరైన నిధులు
ఆదోని	354	40,774	రూ.2కోట్లు
జగన్నాథగట్టు	171	34,184	రూ.3.30లక్షలు
ఆత్మకూరు	3	4,320	రూ.2కోట్లు
నంద్యాల	20	10,885	రూ.2కోట్లు
మొత్తం	548	90,163	రూ.9.30కోట్లు

రూ.9.30కోట్లుతో పనులు

జగనన్న కాలనీల్లో కొత్తగా నిర్మిస్తున్న సబ్‌స్టేషన్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.9.30 కోట్లు మంజూరు చేసింది. ఒక్కో ఉప కేంద్రానికి సివిల్ పనులు, ప్యానెల్స్, లైన్ వర్క్, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఇలా అన్నింటికీ కలిపి ఖర్చు చేయనున్నారు. కర్నూలులోని జగన్నాథగట్టుపై రూ.3.30 కోట్లతో నిర్మిస్తున్న సబ్‌స్టేషన్ పనులు ఇప్పటికే 99 శాతం పూర్తై రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. ఈ సబ్‌స్టేషన్‌ను మంగళవారం దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, సీఎండీ కె. సంతోషరావు సందర్శించి టెక్నికల్‌గా విద్యుత్ సరఫరాను పరిశీలించారు.

నెల రోజుల్లో పనులు పూర్తి



కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న ఇళ్లకు మెరుగైన విద్యుత్ అందించేందుకు చర్యలు చేపట్టాం. ఇప్పటికే వేసిన బోర్లకు విద్యుత్ కనెక్షన్ల కోసం రూ.12.25 కోట్లతో పనులు పూర్తి చేసి, సర్వీసులు ఇచ్చాం. తాజాగా రూ.9.30 కోట్లతో నిర్మిస్తున్న సబ్‌స్టేషన్ పనులను నాణ్యతతో నెల రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు చేపట్టాం.

– ఎం. ఉమాపతి, ఎస్ఈ, ఆపరేషన్స్, కర్నూలు

పెద్దకడబూరు వైస్ ఎంపీపీగా ముత్తమ్మ



ముత్తమ్మకు డిక్లరేషన్ ఫారంను అందజేస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి అశ్వత్థామ

పెద్దకడబూరు: మండల పరిధిలోని చిన్నతుంబళం ఎంపీటీసీ -1 గా ఉన్న ముత్తమ్మ పెద్దకడబూరు వైస్ ఎంపీపీ- 1గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైస్ ఎంపీపీ- 1గా ఉన్న పరమేష్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందడంతో గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రిటర్నింగ్ అధికారి అశ్వత్థామ ఎన్నిక నిర్వహించారు. ముత్తమ్మ అభ్యర్థిత్వాన్ని ఎంపీపీ శ్రీవిధ బలపరచగా.. బసలదొడ్డి ఎంపీటీసీ సభ్యుడు ఆంజనేయ, జాలవాడి ఎంపీటీసీ సభ్యుడు వెంకటేష్, కో ఆప్షన్ సభ్యుడు షేర్‌ఖాన్‌పటేల్ సహా మిగిలిన 11మంది ఎంపీటీసీ సభ్యులు మద్దతు తెలిపారు. దీంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. ముత్తమ్మను వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ రామాంజినేయులు, మాజీ ఎంపీపీ రఘురాముడు తదితరులు అభినందించారు.

విద్యార్థినికి పాముకాటు



చికిత్స పొందుతున్న జాస్మిన్

బొమ్మలసత్రం: నంద్యాల మండలం అయ్యలూరు గ్రామానికి చెందిన ఓ విద్యార్థిని పాముకాటుకు గురైంది. అవుట్ పోస్ట్ పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న జాస్మిన్ మధ్యాహ్నం బహిర్భూమి కోసం పాఠశాల ఆవరణ నుంచి బయటికి వెళ్లగా అక్కడ పాము కాటు వేసింది. అపస్మారక స్థితిలోకి వెళ్లిన బాలికను పాఠశాల సిబ్బంది చికిత్స నిమిత్తం నంద్యాల సర్వజన ఆసుపత్రికి తరలించారు. బాలిక ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

జగనన్నకు చెబుదాంపై నిర్లక్ష్యం వద్దు



జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డీపీఓ నాగరాజునాయుడు

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంపై ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించరాదని జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజునాయుడు అన్నారు. గురువారం ఆయన తన కార్యాలయం నుంచి జిల్లాలోని డీఎల్‌పీఓ, ఈఓఆర్‌డీలతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈకేవైసీ చేయించడంలో ఇతర జిల్లాలతో పోలిస్తే చాలా వెనుకబడ్డామన్నారు. 476 మంది ఈకేవైసీ పూర్తి చేయాల్సి ఉండగా, 12 మాత్రమే చేశారన్నారు. ఓడీఎఫ్ ప్లస్‌కు సంబంధించిన నివేదికలు ఇప్పటి వరకు సి.బెళగల్, గోనెగండ్ల, క్రిష్ణగిరి మండలాలు మాత్రమే వంద శాతం పూర్తయ్యాయని, మిగిలిన మండలాల అధికారులు కూడా సత్వరం స్పందించాలన్నారు. ఆస్తుల రీసర్వే(స్వామిత్వ)కు సంబంధించి ఫైనల్ పబ్లికేషన్ పూర్తయిన గ్రామాల్లో 30 కాలమ్స్ ప్రొఫార్మాను తెలుగులో తయారుచేసి, ఫొటోలను పంపించాలన్నారు.

అందుబాటులో 5.95 లక్షల మొక్కలు



కరివేముల నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

కర్నూలు కల్చరల్: అటవీశాఖ సోషల్ ఫారెస్ట్ ఆధ్వర్యంలోని 10 నర్సరీల్లో పలు రకాల మొక్కలను పెంచింది. విజయ వనం, వెల్దుర్తి, మాదార్‌పురం, కాల్వబుగ్గ, కరివేముల, కోడుమూరు, పందికోన, గోనెగండ్ల, బనవాసి, బోడిబండలో ఉన్న 10 నర్సరీల్లో సుమారు 41 రకాలకు సంబంధించి 5,95,500 మొక్కలు అందుబాటులో ఉన్నాయి. మొక్క రకం, సైజ్‌ను బట్టి రూ.5, రూ.10 ప్రకారం చెల్లించి తీసుకోవచ్చని అటవీ శాఖ సోషల్ ఫారెస్ట్ రేంజర్ శ్రీనివాస్ తెలిపారు.

అందుబాటులో ఉన్న మొక్కల సంఖ్య

వెలగ 16,190, మారేడు 1,900, సుంకేసుల 36,490, సీతాఫలం 14,240, రెయిన్ ట్రీ 36,780, వేప 56,360, టేకు 4,000, సిస్సో 11,800, కానుగ 1,43,080, తపస్సి 49,270, నేరేడు 27,302, సీమరుబ 4,240, సుబాబుల్ 370, జామ 9,200, ఉసిరి 5,778, చింత 30,070, మునగ 1,620, నరేపి 15,430, దిరిసనం 8,860, సీత చింత 29,890, గంగరేవి 3.010, మద్ది 570, అల్లనేరేడు 6,000, పెల్టోఫారం 25,460, నిరుద్ది 5,500, దానిమ్మ 2,100, రేల 3,500, రావి 3,130, మహగని 5,000, బాదం 2,000, జువ్వి 3,000, టబుబియ 13,500, రెడ్ సాండర్స్ 5,000, తెల్లమద్ది 1,000, క్రోటోన్స్ 4,000, గోరింట 1,000, మందారం 500, కాగితపూలు 500, బాంబూ 4,000, బొంగనవల్లి 1,500, నిమ్మ 2,360 మొక్కలు నర్సరీల్లో అందుబాటులో ఉన్నాయి.

వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్‌ను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి

నంద్యాల(వ్యవసాయం): జిల్లాలో వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్‌ను బలోపేతం చేయాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డిలు పేర్కొన్నారు. గురువారం నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ కార్యాలయాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలోనే మొట్టమొదటిగా సొంత నిధులతో నంద్యాల వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ సభ్యులు కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. న్యాయవాదుల సమస్యలు, ప్రజలు, కార్యకర్తల సమస్యల పరిష్కారానికి వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ ముందుండాలన్నారు. లానేస్తం పథకం జూనియర్ న్యాయవాదులకు ఆర్థికంగా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. న్యాయవాదుల సంక్షేమానికి రూ.100 కోట్లు కేటాయించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. కర్నూలులో న్యాయరాజధాని ఏర్పాటు అవుతుందని సీనియర్, జూనియర్ న్యాయవాదులకు తోడ్పాటుగా ఉంటుందన్నారు. పార్టీలకతీతంగా ప్రతి ఒక్క న్యాయవాదికి హెల్త్ కార్డులు, ఇన్సూరెన్స్ కల్పించిందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రీజనల్ కో ఆర్డినేటర్ ప్రభాకర్, కర్నూలు జిల్లా వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడు సువర్ణ రెడ్డి, నంద్యాల జిల్లా అధ్యక్షుడు రామసుబ్బయ్య, పట్టణ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సూర్య నారాయణరెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, వివేకానందరెడ్డి, అశోక్‌రెడ్డి, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శివనాగిరెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్పస్ ఫండ్ చెక్కుల అందజేత



కార్పస్ ఫండ్ చెక్కును అందుకుంటున్న ఎస్ఐ జగన్ సతీమణి అంజలీ దేవి

కర్నూలు: వివిధ కారణాలతో ఇద్దరు పోలీసులు మృతి చెందగా వారి కుటుంబ సభ్యులకు కార్పస్ ఫండ్ చెక్కులను జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కృష్ణకాంత్ గురువారం అందజేశారు. తాలూకా పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తూ ఎస్ఐ జగన్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన భార్య అంజలిదేవికి రూ.లక్ష కార్పస్ ఫండ్ చెక్కును ఎస్పీ అందజేశారు. అలాగే కానిస్టేబుల్ అన్సర్ బాషా (పీసీ నెం.3262) కర్నూలు ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఆయన భార్య సన అఫ్రీన్‌కు రూ.లక్ష కార్పస్ ఫండ్ చెక్కును ఎస్పీ అందజేశారు.

ఇద్దరు వేటగాళ్ల అరెస్టు



వేటగాళ్ల వివరాలు వెల్లడిస్తున్న అటవీ అధికారులు

రుద్రవరం: నూతల నార్త్ బీట్ గండ్లేరు రిజర్వాయరు సమీపంలో ఈ నెల 9వ తేదీన చుక్కల దుప్పిని వేటాడి చంపేసిన కేసులో మరో ఇద్దరు వేటగాళ్లను అటవీ అధికారులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో హరినగరానికి చెందిన జయంబు సూర్యనారాయణ, బాలసాని శ్రీనివాసులు పరారీలో ఉన్నారు. కాగా గురువారం గ్రామ ఆలయ సమీపంలో ఉన్నట్లు అటవీ సిబ్బందికి సమాచారం అందడంతో దాడి చేసి అరెస్ట్ చేశారు. వీరి నుంచి నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నట్లు రేంజి అధికారి శ్రీపతినాయుడు తెలిపారు. చుక్కల దుప్పిని చంపిన కేసులో ఇప్పటి వరకు ఐదుగురు నిందితులను అరెస్టు చేయడంతో పాటు రెండు విడతల్లో రెండు నాటు తుపాకులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రోడ్డు దాటుతూ మృత్యు ఒడికి..

- మోటారు సైకిల్ ఢీకొనడంతో మహిళ మృతి



వెంకటరామమ్మ (ఫైల్)

సి.బెళగల్: రోడ్డు దాటుతుండగా మోటారు సైకిల్ ఢీకొనడంతో ఓ మహిళ మృతి చెందింది. సి.బెళగల్ గ్రామ శివారులో గురువారం ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. సి.బెళగల్‌కు చెందిన వెంకటరామమ్మ (58) గురువారం ఉదయం పొలానికి వెళ్లేందుకు గ్రామ శివారులోని కస్తూర్బా పాఠశాల సమీపంలో రోడ్డు దాటుతుండగా ఓర్వకల్లు మండలం కేతవరం గ్రామానికి చెందిన మౌలాలి అనే వ్యక్తి పొనకలదిన్నె గ్రామానికి పెళ్లి సంబంధానికి వెళ్తూ మోటారు సైకిల్‌తో ఢీకొట్టాడు. దీంతో మహిళ తలకు తీవ్ర గాయాలు కావడంతో అసప్మారక స్థితిలోకి వెళ్లింది. అక్కడున్న వారు గాయపడిన వెంకటరామమ్మను స్థానిక వైద్యుడు దగ్గరకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందనట్లు ఆయన తెలియజేశారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ పీరయ్య కేసు నమోదు చేశారు. మృతురాలికి భర్త వెంకటేష్, ఇద్దరు కుమారులు, ఒక్క కుమార్తె ఉన్నారు.

ఏజీపీగా జగన్‌మోహన్‌రెడ్డి



నంద్యాల(వ్యవసాయం): పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది నూకా జగన్‌మోహన్‌రెడ్డి గురువారం అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్ కోర్టు, సెకండ్ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జ్ కోర్టులో ప్రభుత్వానికి సంబంధించిన కేసులను వాదించడం జరుగుతుందని, తన పదవీ కాలం మూడేళ్ల పాటు కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ నాయకులు విజయశేఖర్‌రెడ్డి, రామసుబ్బయ్య, తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.

బీటెక్ సెమిస్టర్ ఫలితాల విడుదల

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జరిగిన బీటెక్ 3, 5, 7 సెమిస్టర్ రెగ్యులర్, 2, 3, 4, 5, 6 సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు గురువారం వైస్ చాన్సులర్ ఆచార్య ఎ.ఆనందరావు తెలిపారు. 3వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు 164 మంది విద్యార్థులు హాజరుకాగా 92 మంది, 5వ సెమిస్టర్ 261 మందికి గాను 170, 7వ సెమిస్టర్ 225 మందికి గాను 189 మంది పాసయ్యారు. సప్లిమెంటరీలో 2వ సెమిస్టర్‌కు 117 మందికిగాను 52, 3వ సెమిస్టర్ 86 మందికిగాను 28, 4వ సెమిస్టర్ 73 మందికి గాను 41, 5వ సెమిస్టర్ 32 మందికి గాను 23, 6వ సెమిస్టర్ 43 మందికి గాను 32 మంది ఉత్తీర్ణులయ్యారు.

పైరు 'పల్లె'వి



పొలంలో పచ్చగా కళకళలాడుతున్న మొక్కజొన్న పైరు



పడిదెంపాడు గ్రామంలో కళకళలాడుతున్న ఉల్లి నారు



ఉల్లి నారులో కలుపు తీస్తున్న మహిళలు

వర్షాలు ఒక మోస్తరుగా కురుస్తుండడంతో పచ్చదనాన్ని పరచుకుని పల్లెటూర్లు కళకళలాడుతున్నాయి. ఖరీఫ్ సాగు ఊపందుకుని.. ఉల్లి, టమాట, మిరప, మొక్కజొన్న నాట్లలో రైతులు బిజీగా ఉన్నారు. పైర్లలో కలుపు మొక్కలను తొలగిస్తూ కూలీలు పొలాల్లో సందడి చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

సమస్యాత్మక ప్రాంతాల్లో కార్డెన్ సెర్చ్



సమస్యాత్మక వ్యక్తులకు హెచ్చరికలు జారీ చేస్తున్న పోలీసులు

కర్నూలు: కల్లూరు మండలం శరీన్‌నగర్‌లో నాల్గవ పట్టణ పోలీసులు గురువారం తెల్లవారుజామున కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్ఐలు పెద్దయ్య నాయుడు, మధుసూదన్, సునిల్, రామయ్యతో పాటు 40 మంది స్పెషల్ పార్టీ పోలీసు బృందాలు శరీన్ నగర్‌ను చుట్టుముట్టి అనుమానితుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. పది మంది రౌడీషీటర్లు, ఇద్దరు ట్రబుల్ మాంగర్స్, ముగ్గురు సస్పెక్టు ఇళ్లల్లో తనిఖీలు నిర్వహించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని వారిని హెచ్చరించారు. ఎరుకల రామాంజనేయులు ఇంట్లో రెండు కత్తులను స్వాధీనం చేసుకున్నారు. సరైన ధ్రువ పత్రాలు లేని రెండు ఆటోలు, ఆరు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. తెల్లారకముందే పోలీసులంతా కాలనీకి చేరుకోవడంతో ఏమి జరిగిందోనని ప్రజలు పెద్దఎత్తున గుమికూడగా సమస్యాత్మక వ్యక్తులు కొంత మంది కాలనీ నుంచి పారిపోయారు. రౌడీషీటర్లు కొందరిని వీధుల్లోకి రప్పించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఆత్మవిశ్వాసం ఉండగా... అధైర్యం ఎందుకు!

● యంగ్ టాలెంట్

ఆరోగ్యం నుంచి బాలీవుడ్ వరకు రకరకాల వీడియోలు చేస్తూ డిజిటల్ క్రియేటర్‌గా దూసుకుపోతుంది ఢిల్లీకి చెందిన సెజల్ కుమార్. 'ఫ్యాషన్-పాట-డ్యాన్స్' ఆమె బలం. మన దేశంలోని టాప్ యూట్యూబ్ స్టార్‌లలో సెజల్ ఒకరు. ఢిల్లీలోని 'ది మదర్స్ ఇంటర్నేషనల్ స్కూల్'లో చదువుకున్న సెజల్ కుమార్‌కు చిన్నప్పటి నుంచి సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేది. తండ్రి ఆర్మీ మేజర్. ఢిల్లీలోని శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో ఎకనామిక్స్‌లో డిగ్రీ చేసింది. టర్కీకి వెళ్లినప్పుడు 'సమ్మర్ స్టైల్' పేరుతో తొలి వీడియో అప్‌లోడ్ చేసింది. ఆ తరువాత సొంతంగా యూట్యూబ్ చానల్ మొదలుపెట్టింది.చానల్ కోసం చేసిన అయిదు వందలకు పైగా వీడియోలు బాగా పాపులర్ అయ్యాయి.

'ఇండియన్ గర్ల్ బ్యాక్‌ప్యాకింగ్ ఇన్ యూరప్' సిరీస్‌కు మంచి స్పందన లభించింది. సెజల్ తల్లి గైనకాలజిస్ట్. 'ఒక గైనకాలజిస్ట్‌ను అమ్మాయిలు అడగాలనుకునే సందేహాలపై వీడియోలు చేయవచ్చు కదా' అని చానల్ ప్రేక్షకులలో ఒకరు అడిగారు. ఆమె కోరిక మేరకు సెజల్ తల్లితో కలిసి చేసిన 'మామ్ అండ్ మీ' సిరీస్ బాగా పాపులర్ అయింది. ఎలాంటి ప్రశ్న అయినా స్వేచ్ఛగా, నిస్సంకోచంగా అడిగే వాతావరణాన్ని 'మామ్ అండ్ మీ' కల్పించింది.

సెజల్‌కు బాగా నచ్చే సబ్జెక్ట్‌లలో ఫ్యాషన్ ఒకటి. స్ట్రీట్ స్టైల్, స్ట్రీట్ వీడియోలపై మంచి పట్టు ఉంది. తన చానల్ 1 మిలియన్ ఫాలోవర్ మార్క్‌ను చేరుకున్నప్పుడు 'ఓ మై గాడ్' అనుకుంది ఆనందంగా. 'ఇదంతా నేను సొంతంగా సాధించాను' అనే ఆనందం సెజల్‌కు మరింత శక్తిని, ఉత్సాహాన్ని ఇచ్చింది. తన గొంతులోని ఛార్మింగ్ క్వాలిటీతో ఎంతో మంది అభిమానులను సంపాదించుకుంది. యూట్యూబర్‌గా సెజల్ విజయరహస్యం ఏమిటి? ఆమె మాటల్లో...'మొదటి సూత్రం...గుడ్‌క్వాలిటీ కంటెంట్. గత వీడియో కంటే తాజా వీడియో ఎంతో కొంత బాగుండాలి. రెండో సూత్రం...ఎప్పుడో ఒకప్పుడు కాకుండా నిరంతరం ఏదో ఒక వీడియో పోస్ట్ చేస్తుండాలి. మూడో సూత్రం...ప్రేక్షకులతో ఎప్పటికప్పుడు టచ్‌లో ఉండాలి. మనల్ని మనం అప్‌డేట్ చేసుకోవాలి. వారికి ఎలాంటి వీడియోలు కావాలో తెలుసుకోవాలి'


సెజల్ కుమార్

సెజల్ యూట్యూబ్ చానల్ ప్రేక్షకులలో మహిళలు ఎక్కువ. పద్దెనిమిది నుంచి ఇరవైనాలుగు ఏళ్ల వయసు మధ్య ఉన్న వారు ఉంటారు. 'ఒక కాలేజీ స్టూడెంట్ నా దగ్గరకు వచ్చి మీ పేరుతో కనిపించే వీడియో కనిపిస్తే చాలు క్షణం ఆలస్యం చేయకుండా చూస్తాను అని చెప్పింది. ఆమె మాటలు విన్న తరువాత మరింత కష్టపడాలి అనిపించింది' అంటుంది సెజల్. 'కాళీ కాళీ' మ్యూజిక్ ట్రాక్ సింగర్‌గా ఆమె ప్రతిభకు అద్దం పట్టింది. ఎన్నో వ్యాపారప్రకటనల లో నటించిన సెజల్...'కలలను నిజం చేసుకునే విషయంలో అధైర్యం వద్దు. మనపై మనకు ఆత్మవిశ్వాసం ఉండాలి' అంటుంది.

జైపూర్‌లోని మణిపాల్ యూనివర్శిటీలో 'హౌ టు మేక్ యూట్యూబ్ ఏ కెరీర్?' అనే అంశంపై సెజల్ చేసిన ప్రసంగం ఎంతో మంది విద్యార్థులకు స్ఫూర్తి ఇచ్చి ముందుకు నడిపించింది.

● ఇంగ్లిష్ ఇడియమ్



వన్ హార్స్ టౌన్
చాలా చిన్న టౌన్ అని అర్థం

టేక్ సమ్‌వన్స్ వర్డ్ ఫర్ ఇట్
ఒక విషయాన్ని ఎలాంటి ఆధారం లేకపోయినా ఆమోదించడం.

గెట్ డౌన్ టు బ్రాస్ ట్యాక్స్
ఒక విషయానికి సంబంధించి ముఖ్యమైన చర్చను స్టార్ట్ చేయడం.



● సక్సెస్ స్టోరీ

స్టార్ ఫ్యాషన్ డిజైనర్


తన కుటుంబంతో హర్ష్ అగర్వాల్

ఫ్యాషన్ డిజైనర్‌కు రెండు కళ్లతో పాటు మూడో కన్ను ఉండాలి. ఆ కన్ను చారిత్రక,సాంస్కృతిక వైభవాన్ని చూడగలగాలి. కాలంతో పాటు నడుస్తూనే ముందు కాలాన్ని చూడగలగాలి. జైపూర్‌కు చెందిన ఫ్యాషన్ డిజైనర్ హర్ష్ అగర్వాల్‌కు ఈ సామర్థ్యం ఉంది. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన 27 సంవత్సరాల హర్ష్ అగర్వాల్ 'హరగో హ్యాండ్ ఎంబ్రాయిడ్ షర్ట్స్'తో అంతర్జాతీయ స్థాయిలో గెలుపు జెండా ఎగరేశాడు....

రెండు సంవత్సరాల క్రితం...ఆరోజు హర్ష్ అగర్వాల్ ఫ్యాషన్ లేబుల్ ఇన్‌స్టాగ్రామ్ ఎకౌంట్‌కు నోటిఫికేషన్‌ల వరద మొదలైంది. పాపులర్ ఇంగ్లిష్ సింగర్ హారీ స్టైల్స్ 'హరగో హ్యాండ్ ఎంబ్రాయిడ్ షర్ట్స్' ధరించి ఉన్న ఫొటోలు అవి. జైపూర్ ఫ్యాషన్ బ్రాండ్ అంతర్జాతీయ స్థాయిలో వెలిగిపోతుంది అని చెప్పడానికి ఇది చిన్న ఉదాహరణ మాత్రమే.

'ఇలా ఉండాలి. అలా ఉండాలి' అంటూ చిన్నప్పుడు తన దుస్తులను తానే డిజైన్ చేయించేవాడు హర్ష్.

'ఎకనామిక్స్ అండ్ బిజినెస్'లో పట్టా పుచ్చుకున్న హర్ష్ వేరే దారిలో ప్రయాణిస్తానని ఊహించలేదు. 'ఎకనామిక్ అండ్ సోషల్ కౌన్సిల్' ఇంటర్న్‌షిప్ న్యూయార్క్‌లో చేస్తున్న రోజుల్లో 'ఫ్యాషన్' అనే మాట ఎక్కడ వినబడితే తాను అక్కడ ఉండేవాడు. పేరున్న ఫ్యాషన్ డిజైనర్‌లతో ముచ్చటించేవాడు. ఈ క్రమంలో తనకు సొంతంగా ఏదైనా చేయాలనిపించేది.

ఇండియాకు తిరిగివచ్చిన తరువాత...పశ్చిమ బెంగాల్ నుంచి గుజరాత్ వరకు ఎన్నో ప్రాంతాలకు వెళ్లి మన చేనేతకళావైభవాన్ని రెండు కళ్లలో పదిలపరుచుకున్నాడు. వాటి నుంచి స్ఫూర్తి తీసుకొని తల్లి, సోదరితో కలిసి 'హరగో హ్యాండ్స్' అనే మెన్స్‌వేర్ లేబుల్‌కు శ్రీకారం చుట్టాడు.

ముగ్గురితో మొదలైన 'హరగో'లో ఇప్పుడు 20 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ టీమ్‌లో టైలర్‌లు, జూనియర్ డిజైనర్‌లు, ప్రొడక్షన్ ఇన్‌చార్జ్‌లు ఉన్నారు.

'హస్తకళలపై ఎక్కువగా దృష్టి కేంద్రీకరించాలనుకున్నాను. మన దేశానికి తనదైన గొప్ప సాంస్కృతిక, శిల్పకళావైభవం ఉంది. అది చేతి వృత్తి కళాకారుల పనిలో ప్రతిఫలిస్తుంది. అలాంటి వారికి సహాయంగా నిలవాలనుకున్నాను' అంటాడు హర్ష్ అగర్వాల్.

ఒక డిజైన్ హిట్ అయిన తరువాత దాని వెంటే పయనించడం అని కాకుండా ఎప్పటికప్పుడు కొత్త కొత్త డిజైన్‌లపై వర్క్ చేస్తుంటాడు హర్ష్. ప్రతి రోజు ఒక కొత్త శాంపిల్ రూపొందిస్తాడు. 105 పీస్‌లు రెడీ కాగానే ప్రీ-ఆర్డర్స్ కోసం సోషల్ మీడియా పేజీలలో ప్రకటిస్తాడు.

కోవిడ్ కల్లోలం సద్దుమణిగిన తరువాత కొత్త కలెక్షన్ కోసం ఇంటర్నేషనల్ బయర్స్ నుంచి ఆర్డర్లు వెల్లువెత్తాయి. లేబుల్ క్లాతింగ్ రిటైలర్‌లలో మ్యాచెస్ ఫ్యాషన్-లండన్, సెసెన్స్(మాంట్రియల్), ఎల్‌ఎమ్‌డీఎస్-షాంఘై, బాయ్‌హుడ్-కొరియా...మొదలైనవి ఉన్నాయి.

'హరగో'కు ఇది టిప్పింగ్ పాయింట్‌గా మారింది. బ్రాండ్ అభిమానుల్లో ఇంగ్లాండ్‌కు చెందిన టెలివిజన్ హోస్ట్, ఫ్యాషన్ డిజైనర్ టాన్ ఫ్రాన్స్ ఉన్నాడు.

'కొన్ని నెలల క్రితం హర్ష్ బ్రాండ్ గురించి విన్నాను. నా నెట్‌ఫ్లిక్స్ షో కోసం అతడు డిజైన్ చేసిన దుస్తులు ధరించాను. కొత్తగా, కంఫర్ట్‌గా అనిపించాయి. డిజైనింగ్‌లో హర్ష్‌కు తనదైన నేర్పు ఉంది' అంటున్నాడు టాన్ ఫ్రాన్స్.

హర్ష్ కొత్త కలెక్షన్ డిజైన్ స్కెచ్‌లతో మొదలు కాదు. నేతకళాకారులతో ముచ్చటించిన తరువాత ఒక ఐడియా వస్తుంది. దాన్ని మెరుగులు దిద్దడంపై దృష్టి పెడతాడు. 'హర్ష్ వర్క్‌లో క్వాలిటీ మాత్రమే కాదు క్లాసిక్ లుక్ కనిపిస్తుంది' అంటుంది టెక్స్‌టైల్ ఇనోవేషన్ ప్రాజెక్ట్ 'అంబ' ఫౌండర్ హేమ ష్రాఫ్ పటేల్.

● టెక్.. టాక్

హువావే నోవా 11 ప్రో



● డిస్‌ప్లే: 6.78 అంగుళాలు ● రిఫ్రెష్‌రేట్: 120 హెచ్‌జడ్ ● బ్యాటరీ: 4500 ఎంఏహెచ్ ● ఫ్రంట్ కెమెరా: 50 ఎంపీ +8 ఎంపీ ● ర్యామ్: 8జీబి ● రిజల్యూషన్: 1200x2652 పిక్సెల్స్ ● ఇంటర్నల్ మెమోరీ: 256 జీబి ● ఆపరేటింగ్ సిస్టమ్: హామని వోఎస్ ● బరువు: 188 గ్రా. ● కలర్స్: లుమినస్ గోల్డ్, డాన్ గోల్డ్, స్నోవీ వైట్

నాయిస్ ఫిట్ ట్విస్ట్ ప్రో స్మార్ట్‌వాచ్



● డిస్‌ప్లే: 1.4 అంగుళాలు ● ఫీచర్: బ్లూటూత్ కాలింగ్ మెటాలిక్ డయల్ ● హెల్త్ మానిటర్స్: హార్ట్‌రేట్, బ్లడ్ ఆక్సిజన్ లెవెల్ సెన్సర్, స్లీప్ ట్రాకర్... మొదలైనవి. ● వాటర్ అండ్ డస్ట్ రెసిస్టెంట్ ● 120 స్పోర్ట్స్ మోడ్స్ ● బ్యాటరీ: 300 ఎంఏహెచ్

టేబుల్ టాప్ స్టాండ్



బ్రాండ్: స్వాప్‌కార్ట్
కలర్: మల్టీ కలర్
కంపాటబుల్: ఆల్ స్మార్ట్‌ఫోన్స్ ప్రొడక్షన్ డైమెన్షన్స్: 16x10x4 సెంటీ మీటర్
ఫీచర్స్: ఫ్లెక్సిబుల్, ఫోల్డబుల్ ఆర్మ్
మెటీరియల్: అల్యూమినీయం
బరువు: 240 గ్రా.

గూగుల్ ఫొటోస్‌లో కొత్త ఎఫెక్ట్‌లు...



ఫొటో అండ్ వీడియో వ్యూయింగ్ యాప్ 'గూగుల్ ఫొటోస్'లో ఫిక్స్ లైటింగ్, మ్యాజిక్ ఎరేజర్‌లాంటి ఎన్నో ఉపయోగకరమైన ఫీచర్లు ఉన్నాయి. తాజాగా త్వరలో రాబోతున్న 12 కొత్త ఎఫెక్ట్‌ల గురించి ప్రకటించింది గూగుల్. అవి ఏమిటంటే... బ్లాక్ అండ్ వైట్ ఫిల్మ్, లోమో, డస్ట్ మిక్స్, పేపర్ టియర్, లైట్ లీక్, ఫిల్మ్ మూడ్, ఫిష్ ఐ, క్రోమటిక్, వింటేజ్, లేఔట్స్, పోస్టర్ అండ్ రెట్రో ఫిల్మ్.

● గేమింగ్: నేడే విడుదల

వస్తున్నారహో!



ఊహించని ఉపద్రవం... కలలో కూడా చూడని క్రూర జంతుసమూహం... అడుగు తీసి అడుగు వేస్తే ప్రమాదం. ఎక్సోప్రైమల్‌లో ఎన్నో సవాళ్లు మీ కోసం ఎదురుచూస్తున్నాయి. థర్డ్-పర్సన్ షూటర్‌గేమ్ ఎక్సోప్రైమల్ నేడు విడుదల అవుతుంది. ఈ మల్టీప్లేయర్ యాక్షన్ గేమ్‌లో ప్లేయర్ డైనోసర్‌లతో పాటు ఎన్నో అపరిచిత మృగాలతో పోరాడవలసి ఉంటుంది. ప్లేయర్-వర్సెస్-ప్లేయర్-వర్సెస్ ఎన్విరాన్‌మెంట్ వీడియో గేమ్ ఇది. ప్లేయర్ ఎక్సోఫైటర్‌ను కంట్రోల్ చేయాల్సి ఉంటుంది. ఈ గేమ్‌లో ఎన్నో రకాలైన వెపన్స్ ఉంటాయి. గేమ్‌లోని మెయిన్ మోడ్ డినో సర్వైవల్. 'ఎక్సోప్రైమల్'ను యాక్షన్ గేమ్‌గా తీర్చిదిద్దింది జపాన్‌కు చెందిన వీడియోగేమింగ్ కంపెనీ క్యాప్‌కామ్.

ఇంజిన్: ఆర్‌ఈ ఇంజిన్ ; జానర్: థర్డ్ పర్సన్ షూటర్ ; ప్లేస్టేషన్స్: ప్లే స్టేషన్ 4, ప్లేస్టేషన్ 5, విండోస్, ఎక్స్‌బాక్స్ వన్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్

ఐ వాన్న వాకౌట్


రష్మికా మందన్నా

ఒక్క చాన్స్ వచ్చేవరకే ఎవరైనా ఆ చాన్స్ కోసం కష్టపడాలి. ఆ ఒక్క చాన్స్ బంపర్ చాన్స్ అయితే ఆ తర్వాతి చాన్సులు అవే వస్తాయి. ఇందుకు ఓ ఉదాహరణ పూజా హెగ్డే, రష్మికా మందన్నా. స్టార్ హీరోయిన్లుగా ఈ ఇద్దరూ తెలుగు, తమిళ, హిందీ చిత్రాలు చేస్తూ దూసుకెళుతున్నారు. చివరికి ఈ ఇద్దరూ డేట్స్ సర్దుబాటు చేయలేక సినిమాలు వదులుకునేంత బిజీ. అటు హిందీకి వెళితే ప్రియాంకా చోప్రా, కత్రినా కైఫ్ కూడా ఈ మధ్య ఒక సినిమా వదులుకున్నారు. 'నో డేట్స్.. ఐ వాన్న వాకౌట్' అంటూ ఈ నలుగురూ వదులుకున్న చిత్రాల గురించి, పూజ-రష్మిక వాకౌట్ చేయడం వల్ల ఆ ప్లేస్‌ని రీప్లేస్ చేయడానికి దర్శక-నిర్మాతలు పరిశీలిస్తున్న హీరోయిన్ గురించి తెలుసుకుందాం.

గుంటూరు కారం మిస్

'ఒక లైలా కోసం'తో (2014) తొలిసారి తెలుగు తెర్పై మెరిశారు పూజా హెగ్డే. ఆ తర్వాత వరుస సినిమాలతో ఇక్కడ ఫుల్ బిజీ. అటు తమిళ, హిందీ నుంచి అవకాశాలు దక్కించుకున్నారు. ఇలా బిజీగా ఉన్న పూజ ఇటీవల డేట్స్ సర్దుబాటు చేయలేక 'గుంటూరు కారం' నుంచి తప్పుకున్నారని ఆమె వ్యక్తిగత సిబ్బంది పేర్కొన్న విషయం తెలిసిందే. మహేశ్‌బాబు హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. త్రివిక్రమ్‌తో 'అరవింద సమేత వీర రాఘవ', 'అల.. వైకుంఠపురములో' వంటి హిట్ చిత్రాల్లో నటించారు పూజ. 'గుంటూరు కారం' నుంచి వాకౌట్ చేయకపోయి ఉంటే ఈ ఇద్దరి కాంబోలో ఇది మూడో సినిమా అయ్యుండేది. అలాగే 'మహర్షి' వంటి హిట్ తర్వాత మహేశ్‌బాబు-పూజ కాంబోలో రెండో సినిమా అయ్యుండేది. అయితే 'గుంటూరు కారం' నుంచి పూజ తప్పుకున్నప్పటికీ సూర్యదేవర నాగవంశీతో కలిసి త్రివిక్రమ్ భార్య సాయి సౌజన్య నిర్మించనున్న చిత్రంలో ఈ బ్యూటీ నటించే చాన్స్ ఉందట. సాయిధరమ్ హీరోగా సంపత్ నంది దర్శకత్వంలో రూపొందించనున్న చిత్రానికి పూజని హీరోయిన్‌గా తీసుకోవాలని నాగవంశీ, సాయి సౌజన్య అనుకున్నారట. పూజని సంప్రదించారని సమాచారం. అయితే ఇంకా ఆమె కథ వినలేదట.

నితిన్ సినిమా మిస్

'ఛలో'తో తెలుగుకి పరిచయమయ్యారు రష్మికా మందన్నా. ఈ సినిమాలో సింపుల్ గాళ్‌గా ఎంట్రీ ఇచ్చి, స్టార్‌గా ఎదిగారు. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, హిందీ సినిమాలు చేస్తున్నారీ బ్యూటీ. ప్రస్తుతం 'పుష్ప 2', 'రెయిన్ బో'తో పాటు మరో తెలుగు సినిమా, హిందీ చిత్రాలతో రష్మిక ఫుల్ బిజీ. అందుకే నితిన్ సరసన ఒప్పుకున్న చిత్రానికి కాల్‌షీట్స్ అడ్జెస్ట్ చేయలేకపోయారట. తెలుగులో రష్మిక ఎంట్రీ ఫిల్మ్ 'ఛలో' దర్శకుడు వెంకీ కుడుముల దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. తొలి హిట్ ఇచ్చిన దర్శకుడితో 'భీష్మ' వంటి రెండో హిట్ కూడా అందుకున్నారు రష్మిక. సో... వెంకీ కుడుములతో మూడో సినిమాని రష్మిక మిస్ అయ్యారు.


అనుష్కా శర్మ


కియారా అద్వానీ

ఒకరు వదులుకున్న చాన్స్ ఆటోమేటిక్‌గా వేరొకరికి దక్కడం సహజం. అలా 'గుంటూరు కారం' నుంచి పూజా హెగ్డే తప్పుకోవడం శ్రీలీలకి, మీనాక్షీ చౌదరికి ప్లస్ అయింది. ముందు ఈ చిత్రంలో శ్రీలీలను రెండో హీరోయిన్‌గా అనుకున్నారు. కానీ పూజ తప్పుకోవడంతో ఆమె మెయిన్ హీరోయిన్ అయ్యారు. శ్రీలీల స్థానంలోకి మీనాక్షీ చౌదరి వచ్చారు. అలాగే నితిన్ సినిమా నుంచి రష్మికా మందన్నా తప్పుకోవడంతో ఆ చాన్స్ కూడా శ్రీలీలకే వెళ్లనుందని టాలీవుడ్ టాక్. అటు హిందీ 'జీ లే జరా' విషయానికొస్తే.. ప్రియాంకా చోప్రా, కత్రినా కైఫ్ తప్పుకోవాలనుకోవడంతో అనుష్కా శర్మ, కియారా అద్వానీ వంటి నాయికల పేర్లను పరిశీలిస్తున్నారట ఫర్హాన్ అక్తర్.

నిజానికి 'భీష్మ' సినిమాతో నితిన్-రష్మిక హిట్ పెయిర్ అనిపించుకున్నారు. ఒకవేళ రష్మిక డేట్స్ అడ్జెస్ట్ చేయగలిగితే మరోసారి ఈ జంట సిల్వర్ స్క్రీన్‌పై కనిపించేది.


మీనాక్షీ చౌదరి
శ్రీలీల


కత్రినా కైఫ్


ప్రియాంకా చోప్రా

రీప్లేస్ చేసేది ఎవరు?

బాలీవుడ్‌లో ఈ మధ్య ప్రకటించిన చిత్రాల్లో 'జీ లే జరా' అందరి దృష్టినీ ఆకర్షించింది. దానికి కారణం ఇది లేడీ ఓరియంటెడ్ ఫిల్మ్ కావడం, చిత్రదర్శకుడు ఫర్హాన్ అక్తర్ కథానాయికలుగా ప్రియాంకా చోప్రా, కత్రినా కైఫ్, ఆలియా భట్‌లను ఎన్నుకోవడం. అయితే హాలీవుడ్ ప్రాజెక్ట్స్ వల్ల ఈ చిత్రాన్ని 2024లో ఆరంభించాలని ఫర్హాన్‌ని ప్రియాంక కోరారట. ఫర్హాన్ ఓకే చెప్పారని టాక్. ఈలోపు కత్రినా వేరే ప్రాజెక్ట్స్ ఒప్పుకోవడంతో ఈ చిత్రానికి డేట్స్ సర్దుబాటు చేయలేనన్నారట. కాగా 'సిటాడెల్ 2' స్టార్ట్ అయ్యే చాన్స్ ఉన్నందున టోటల్‌గా ఈ సినిమా నుంచి వాకౌట్ చేయాలని ప్రియాంక నిర్ణయించుకున్నారట. కత్రినా కూడా ఇదే నిర్ణయం తీసుకున్నారని సమాచారం.


ఆలియా భట్


'హాయ్ నాన్న' పోస్టర్

హాయ్ నాన్న

నాని హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'హాయ్ నాన్న' అనే టైటిల్ ఖరారు చేశారు. శౌర్యువ్ దర్శకత్వంలో మోహన్ చెరుకూరి (సీవీఎం), డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్న ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్. ఈ చిత్రానికి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో 'హాయ్ నాన్న' అని, హిందీలో 'హాయ్ పప్పా' అనే టైటిల్‌ను ఖరారు చేసి, ఫస్ట్ లుక్, గ్లింప్స్‌ను విడుదల చేశారు. ''తండ్రీ-కూతురు భావోద్వేగాలతో కూడిన ఫీల్ గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. యూనిక్ స్టోరీ లైన్‌తో రూపొందుతున్న ఈ చిత్రం అన్ని భాషలవారికీ కనెక్ట్ అవుతుంది. ఈ ఏడాది డిసెంబర్ 21న చిత్రాన్ని రిలీజ్ చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది.

మహారాజా రెడీ


విజయ్ సేతుపతి

విజయ్ సేతుపతి కెరీర్‌లో 50వ మైలురాయిగా తెరకెక్కిన చిత్రం 'మహారాజా'. నితిలన్ సామినాథన్ దర్శకత్వం వహించారు. అనురాగ్ కశ్యప్, మమతా మోహన్‌దాస్, నట్టి నటరాజ్ కీలక పాత్రలు పోషించారు. ప్యాషన్ స్టూడియోస్ సుధన్ సుందరం, ది రూట్-థింక్ స్టూడియోస్ జగదీష్ పళనిసామి సమర్పణలో రూపొందిన ఈ సినిమా రిలీజ్‌కు రెడీ అవుతోంది.

నార్నే నితిన్ కొత్త సినిమా షురూ


అల్లు అరవింద్, నయన్ సారిక, నార్నే నితిన్

హీరో ఎన్టీఆర్ బావమరిది నార్నే నితిన్ హీరోగా కొత్త సినిమా షురూ అయింది. అంజిబాబు కంచిపల్లి దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రంలో నయన్ సారిక హీరోయిన్‌గా నటిస్తున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో జీఏ 2 పిక్చర్స్‌పై బన్నీ వాసు, విద్యా కొప్పినీడి నిర్మిస్తున్న ఈ చిత్రం గురువారం ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి నిర్మాత 'దిల్' రాజు కెమెరా స్విచ్ఛాన్ చేయగా, నిర్మాత అల్లు అరవింద్ క్లాప్ కొట్టారు. డైరెక్టర్ చందు మొండేటి గౌరవ దర్శకత్వం వహించగా, దర్శకుడు మారుతి స్క్రిప్ట్‌ను మేకర్స్‌కు అందించారు. ''జీఏ 2 బ్యానర్‌లో ప్రతిష్ఠాత్మకంగా రూపొందుతున్న చిత్రమిది'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సహనిర్మాత: ఎస్‌కేఎన్, కెమెరా: సమీర్ కళ్యాణ్, సంగీతం: రామ్ మిర్యాల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: భానుప్రతాప్, రియాజ్ చౌదరి, అజయ్ గద్దె.

మిస్టర్ ప్రెగ్నెంట్ డేట్ ఫిక్స్


సయ్యద్ సోహైల్, రూపా కొడవాయుర్

'బిగ్ బాస్' ఫేమ్ సయ్యద్ సోహైల్ రియాన్ హీరోగా నటించిన 'మిస్టర్ ప్రెగ్నెంట్' విడుదల తేదీ ఖరారైంది. ఆగస్టు 18న ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది. శ్రీనివాస్ వింజనంపాటి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రూపా కొడవాయుర్ హీరోయిన్‌గా నటించారు. అప్పిరెడ్డి, రవీందర్ రెడ్డి సజ్జల, వెంకట్ అన్నపరెడ్డి నిర్మించారు. ''ఈ చిత్రంలో సోహైల్ ప్రెగ్నెంట్‌గా కనిపించనున్నాడు. తెలుగు తెర్పై ఇదొక కొత్త తరహా ప్రయత్నం. వైవిధ్యమైన సినిమాలకు ఆదరణ లభిస్తున్న నేపథ్యంలో మా 'మిస్టర్ ప్రెగ్నెంట్' సక్సెస్ సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: నిజార్ షఫీ, సంగీతం: శ్రవణ్ భరద్వాజ్.

నా చివరి సినిమాని బలమైన కథతో చేయాలనుకున్నా!

– ఉదయనిధి స్టాలిన్



''నాయకుడు' చాలా మంచి కథ, పొలిటికల్ డ్రామా, సామాజిక న్యాయం, ప్రజల మధ్య సమానత్వం గురించి ఈ మూవీలో చర్చించాం. యూనివర్సల్ అప్పీల్ ఉన్న ఈ కథ తెలుగు ప్రేక్షకులకు కూడా నచ్చుతుంది'' అని ఉదయనిధి స్టాలిన్ అన్నారు. మారి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన తమిళ చిత్రం 'మామన్నన్'. ఉదయనిధి స్టాలిన్ హీరోగా నటించి, నిర్మించారు. కీర్తీ సురేష్ హీరోయిన్. జూన్ 29న ఈ చిత్రం విడుదలైంది. తెలుగులో 'నాయకుడు' పేరుతో ఏషియన్ మల్టీప్లెక్స్, సురేష్ ప్రొడక్షన్స్ విడుదల చేస్తున్నాయి. నేడు ఈ మూవీ రిలీజవుతోంది. ఈ సందర్భంగా ఉదయనిధి మాట్లాడుతూ–''తెలుగులో నా గత చిత్రాలు ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు. అందుకే ఈ సినిమాను తమిళంలో మాత్రమే విడుదల చేయాలనుకున్నాం. అయితే తమిళంలో మంచి వసూళ్లను సాధించడంతో ఏషియన్, సురేష్ ప్రొడక్షన్స్ తెలుగులో విడుదల చేస్తున్నారు. నేను సినిమాల నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నాక నా చివరి సినిమాని బలమైన కథతో మారి సెల్వరాజ్‌తో చేయాలనుకున్నాను'' అన్నారు.